క్లుప్తంగా

నేడు గృహ యజమానులతో సమావేశం

బేస్తవారిపేట: జాతీయ రహదారి 544డీ రోడ్డు విస్తరణలో నివాస గృహాలు, భూములు కోల్పోయిన ప్రజలతో బుధవారం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాలులో మార్కాపురం సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ ఫర్వీన్ తెలిపారు. విస్తరణ పనులు గతంలో పూర్తి స్థాయిలో జరుగకుండా అడ్డుకోవడంపై జేసీ ఆదేశాల మేరకు యజమానులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గృహ, భూములు కోల్పోతున్న యజమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బేస్తవారిపేటలో ఓ మోస్తరు వర్షం



బేస్తవారిపేటలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా వేసవిని తలపిస్తున్న ఉక్కపోత, ఎండల నుంచి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలిగింది. సజ్జ, కంది, కొర్ర, పత్తి పంటలకు కొంతమేర మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గేదెను ఢీకొట్టిన లారీ



తీవ్రంగా గాయపడిన గేదె

పొదిలి: వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టటంతో తీవ్రంగా గాయపడిన ఓ గేదె అక్కడే కుప్పకూలింది. ఈ సంఘటన మంగళవారం స్థానిక దర్శి రోడ్డులోని రామనగర్ వద్ద చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న గేదెను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టటంతో కొమ్ము విరిగి, నడుము భాగంలో తీవ్ర గాయమైంది. గేదెలే తమకు జీవనాధారామని, వైద్యం చేయించాలని యజమాని కోరారు.

దోమల నివారణకు చర్యలు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

పొదిలి: నగర పంచాయతీ పరిధిలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పొదిలిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. దోమలు అధికంగా ఉన్న కాలనీల ప్రజలు సమాచారం తెలియజేయాలని సూచించారు.

కరాటేలో చిన్నారులకు బంగారు పతకాలు



విజేతలను అభినందిస్తున్న కరస్పాండెంట్ రూబీ

పొదిలి: విజయవాడలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక నిర్మలా కాన్వెంట్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. స్పారింగ్ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి సీహెచ్ లక్కీ షాలేం, తొమ్మిదో తరగతి విద్యార్థి రాకేష్ పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలతోపాటు కరాటే మాస్టర్ జానీబాషాను మంగళవారం కరస్పాండెంట్ సిస్టర్ రూబీ, హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ రాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్దుబాటుతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం



మార్కాపురంలో ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఈఓ రాందాస్ నాయక్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో 14 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వీటిలో ఉపాధ్యాయుల కొరత ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీలను సర్‌ప్లస్‌లో చూపకుండా అవసరమైన సబ్జెక్టు టీచర్స్(స్కూల్ అసిస్టెంట్లు లేదా ఎస్‌జీటీలను) ఆయా మున్సిపల్ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో సర్‌ప్లస్‌గా ఉన్న ఉపాధ్యాయులను ఆయా మున్సిపాలిటీల పరిధిలోని పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎం.శ్రీనివాస్‌నాయక్, శ్రీరాములు, రవికుమార్, శేషయోగయ్య, వెన్నా కాశిరెడ్డి, నాగ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓ'రబ్బీ' పరిహారమెప్పుడు?

- మార్కాపురం సబ్ డివిజన్‌లో 4,730 హెక్టార్లలో పంట నష్టం
- పరిహారం కోసం 5,940 మంది రైతుల ఎదురుచూపులు
- ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం రూ.4.65 కోట్లు



రబీలో ఎండిపోయిన సజ్జ పంట



మార్కాపురం ప్రాంతంలో పర్యటించిన కేంద్ర బృందం (ఫైల్)

నష్టం అంచనాలు ఇలా..

మండలం	నష్టపోయిన రైతులు	పంట నష్టం సంభవించిన భూమి(హెక్టార్లలో)	రావలసిన పరిహారం(రూ.లో)
మార్కాపురం	1210	1095.44	1,08,08,300
అర్ధవీడు	1087	760.98	74,31,584
పెద్దారవీడు	788	481.41	46,30,900
కంభం	1406	1211.78	1,19,58,987
తర్లుపాడు	1449	1180.97	1,17,24,250
మొత్తం	5940	4730.58	4,65,54,021

మార్కాపురం: గత ఐదేళ్లలో ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు పంట నష్టం సంభవిస్తే అదే సీజన్‌లో పరిహారాన్ని అందించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవడంతో సాగు సాఫీగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు దాటినా గతేడాది రబీ సీజన్‌లో ఏర్పడిన పంట నష్టానికి సంబంధించి ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం ప్రకటించలేదు. ఇప్పటికే అకాల వర్షాలు, తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులు ఈ సీజన్‌లో వ్యవసాయ పెట్టుబడి కోసం అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

మార్కాపురం సబ్‌డివిజన్‌లో మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం, అర్ధవీడు మండలాల్లో రైతులు గత రబీ సీజన్‌లో మిర్చి, పత్తి, అపరాలు తదితర పంటలను సాగు చేశారు. నవంబర్, డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలతో పొలాల్లో నీరు నిల్వ చేరి పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, మిర్చి పంటలకు ఊహించని విధంగా తెగుళ్లు సోకడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయాయి. తెగుళ్ల నివారణ కోసం రైతులు వేలాది రూపాయలు ఖర్చుచేశారు. ముఖ్యంగా మినుము, కంది, సజ్జ, పొద్దుతిరుగుడు, ఆముదం, నూగు, జొన్న తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్ 20న కేంద్ర కరువు బృందం మార్కాపురం ప్రాంతంలో పర్యటించింది. ఈ బృందంలో ఎమ్అండ్‌ఏ డైరెక్టర్ మన్నుజీ ఉపాధ్యాయ, కేంద్ర పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ఈ కశ్యప్, న్యూఢిల్లీకి చెందిన ఫుడ్అండ్ పబ్లిక్ డిపార్ట్‌మెంటు డిప్యూటీ డైరెక్టర్ మదన్‌మోహన్ మౌర్య, నీతిఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బట్నాతోపాటు స్థానిక, జిల్లా అధికారులు ఉన్నారు. ముందుగా వేములకోట చెరువును పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడారు. రబీ సీజన్‌లో ఏర్పడిన కరువు పరిస్థితులు, పంటల దిగుబడి, పెట్టుబడి వ్యయం, ఉపాధి హామీ పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం వారు కోలభీమునిపాడు గ్రామాన్ని కూడా సందర్శించి అక్కడ కరువు పరిస్థితులను అంచనా వేశారు. కేంద్రానికి నివేదిక ఇస్తామని చెప్పి వెళ్లారు. రెండు నెలలు కావస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు సాయంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రకాశాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కరువుసాయం అందించాలి



కేంద్ర ప్రభుత్వం జూన్ 20న రాష్ట్రంలో పర్యటించింది. మార్కాపురంలో కూడా పర్యటించి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఆర్థిక సాయంపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ విషయమై మేము వినతిపత్రాలు కూడా ఇచ్చాం. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం నేత

కాంట్రాక్టు కార్మికులపై అంత కక్ష ఎందుకు?

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ
- మార్కాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పది మంది కాంట్రాక్టు కార్మికులను ఎటువంటి కారణం చూపకుండా తొలగించడం అన్యాయమని మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట అనధికారికంగా తొలగించిన కార్మికులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. రఫీ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ కార్మికులను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. సుమారు 20 సంవత్సరాలుగా ఇంజినీరింగ్, వివిధ విభాగాల్లో కార్మికులను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు సహకరించడాన్ని తప్పుబట్టారు. కార్మికులకు వేతనం పెంచకపోగా, ఉపాధి అవకాశాన్ని తొలగించి, వారి పొట్టకొట్టడం అన్యాయమన్నారు. కమిషనర్ జోక్యం చేసుకుని తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, రమణ, నాసరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ప్రయోజనాలు కనుగొనాలి



చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సర్పంచులు

గిద్దలూరు రూరల్: గ్రామాల్లో సేకరించిన తడి చెత్త, పొడిచెత్త సేకరలో కలిగే ప్రయోజనాలను కనుగొనాలని ఎంపీడీఓ హేమలత అన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలోని చెత్త సేకరణ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెత్తసేకర కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో నెలకొన్న శుభ్రత పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం, గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు సలహాలపై గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ వంటి వాటిపై సర్పంచులు, కార్యదర్శులు సమన్వయ దృష్టి పెట్టాల్సిన అంశాలను ఆమె వివరించారు. ప్రధానంగా చెత్త సేకరణలో పారిశుధ్య కార్మికులు తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి వర్మికంపోస్టుగా మార్చడంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈఓఆర్డీ చెన్నారావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ ఈఈ నాగేశ్వరరావు

బేస్తవారిపేట: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఈఈ పీవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం మండలంలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు నిర్వహించిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట మండలంలో 40 బృందాలుగా ఏర్పడి 1458 గృహ సర్వీసులు, 222 వాణిజ్య సముదాయాలను, 20 ఇతర సర్వీసులను తనిఖీ చేశామని చెప్పారు. విద్యుత్ అక్రమంగా వాడుతున్న 29 గృహ సర్వీసులను గుర్తించి వినియోగించిన 60 కిలోవాట్స్ అదనపు లోడ్‌కు రూ.3,38,500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. విజిలెన్స్ డీఈ వి.శ్రీనివాసరావు, మార్కాపురం డీఈఈ ఎస్.సియానాయక్, గిద్దలూరు డీఈఈ శేషగిరిరావు, విద్యుత్‌శాఖ ఏఈలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ

కంభం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. కార్యదర్శులు, సర్పంచ్‌ల రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలు గృహాల్లోని చెత్తను చెత్తబుట్టలో వేసుకొని ఇంటి వద్దకు పంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు అందులో వెయ్యాలన్నారు. ఇంట్లోని చెత్తను మురుగు కాల్వల్లో వేస్తే మురుగు నిల్వ ఉండి పోవడంతో పాటు దోమల వృద్ధి పెరిగి రోగాల బారినపడే అవకాశం ఉందన్నారు. అనంతరం అధికారులు గ్రీన్ అంబాసిడర్స్‌తో కలిసి చిన్నకంభంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సర్పంచులు, కార్యదర్శులు బ్రహ్మయ్య, జ్యోష్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించాలి



జాతీయ జెండాలతో గొట్లగట్టు కేజీబీవీ బాలికలు



తర్లుపాడు: లింగారెడ్డి కాలనీలో విద్యార్థుల ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ అన్నారు. భారతీయ జనతా యువ మోర్చ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో విద్యార్థులతో కలిసి జాతీయ జెండాతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండాను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. దేశ భక్తిని ప్రతి భారతీయుడు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా నేటి విద్యార్థుల్లో దేశం గొప్పతనం తెలియజేయాలన్నారు. బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, రామాంజనేయులు, బండారి జయప్రసాద్, మారుతీప్రసాద్, తిరుపాల్‌రెడ్డి, రమణ, వీరచక్రం, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో చిన్నారులు జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించిన పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రంథాలయం పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

కొనకనమిట్ల: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం గొట్లగట్టు కేజీబీవీలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ.. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టత గురించి వివరించారు. బాలికలు పాఠశాల ఆవరణలో జాతీయ జెండాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు హాజరు కావాలి

బేస్తవారిపేట: స్వాతంత్ర్య దిన వేడుకలకు మాజీ సైనికులు, సైనిక వితంతువులు, సైనికులు, సైనిక కుటుంబాల ప్రతినిధులు హాజరు కావాలని నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆరు మండలాల్లోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయాల్లో గురువారం ఉదయం 8 గంటలకు జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. మార్కాపురంలో నూతనంగా నిర్మించిన అమరవీరుల స్థూపం ప్రారంభోత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డికాలనీలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులు హర్‌ఘర్ తిరంగాను ఉత్సాహంగా నిర్వహించారు. హెచ్‌ఎం మౌలాలీ ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయుడు షెక్షావలి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

కంభం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని జంగంగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు అన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఉన్న నెమలిదిన్నె రంగారెడ్డి మంగళవారం పాఠశాలలోని విద్యార్థులకు రూ.50 వేలు విలువచేసే దుస్తులను తన తల్లి వీరమ్మ ద్వారా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ రంగారెడ్డి గతంలో కూడా పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి ఔదార్యాన్ని చాటుకున్నారని, గ్రామస్తులు పాఠశాలలకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు పిచ్చిరెడ్డి, జాన్, కాంతారావు నాయక్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

మార్కాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు మంగళవారం సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల శిక్షణను ఎంపీడీఓ తోట చందన అధ్యక్షతన ఎంపీపీ బండి లక్ష్మీదేవి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్ చట్టంలోని పలు నిబంధనలను డీఎల్‌డీఓ సాయికుమార్ వివరించారు. దరిమిడుగులోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, రిసోర్స్‌పర్సన్ కిశోర్, సర్పంచ్‌లు పంచాయితీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



తువ్వపాడులో షెడ్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తొట్లను పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్‌లు

కొనకనమిట్ల: ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. సమావేశం అనంతరం మండలంలోని తువ్వపాడులో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్దకు సభ్యులను తీసుకెళ్లి నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ రహీం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఈఓఆర్డీ పీటీవి కృష్ణ కోరారు. మంగళవారం పొదిలి మండలంలోని జువ్వలేరు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు.


యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

గిద్దలూరు రూరల్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశంలో ఆయన మాట్లాడారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

కొమరోలు: మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లికార్జుననాయుడు తెలిపారు. ఈ నెల 16, 19 తేదీల్లో అల్లినగరం రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని, 20వ తేదీన సూరవారిపల్లి, 21న బాదినేనిపల్లి, 22న క్రిష్ణంపల్లి, 23న మొట్టుపల్లి, 24, 26 తేదీల్లో రెడ్డిచెర్ల, 27, 28 తేదీల్లో ఇడమకల్లు, 29, 30 తేదీల్లో రాజుపాలెం, 31న వెన్నంపల్లె, సెప్టెంబర్ 2న జి.మొరాయిపల్లి, 3న నల్లగుంట్ల, 4న దద్దవాడ, 5న అలసందలపల్లె, 6న పొట్టిపల్లె, 7న అక్కపల్లె, 9న పుల్లారెడ్డిపల్లె, 10న చింతలపల్లె, 11 నుంచి 19వ తేదీ వరకు కొమరోలు, 20, 21న బ్రాహ్మణపల్లె, 24న తాటిచెర్ల, 25న ముత్రాసుపల్లె, 26న హసనాపురం, 27, 28 తేదీల్లో నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఎవరికైనా భూ సమస్యలుంటే సంబంధిత రైతులు రెవెన్యూ సదస్సుల్లో అర్జీల రూపంలో తమ సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని కోరారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌తో బాలచంద్రుడు, కరుణయ్య

కొనకనమిట్ల: రెవెన్యూ పరంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల విభాగం జిల్లా కార్యదర్శి నుసుం బాలచంద్రుడు కోరారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ఆవుల సురేష్‌ను బాలచంద్రుడుతోపాటు మండల దివ్యాంగుల విభాగం కన్వీనర్ గొంగటి కరుణయ్య కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. మండలంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తహసీల్దార్‌కు వివరించగా సానుకూలంగా స్పందించారని చెప్పారు.

అర్హులకు కౌలుకార్డులు మంజూరు చేయాలి

బేస్తవారిపేట: అర్హత ఉన్న కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 1269 మంది కౌలు రైతులు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 876 మందికి సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తులు వస్తే తీసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ పర్వీన్, ఏఓ జక్కం మెర్సీ పాల్గొన్నారు.

గణితాభివృద్ధిపై అవగాహన



విద్యార్థులతో జిల్లా కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు

తర్లుపాడు: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం భాషా పునాది, గణితాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్ఎల్ఎమ్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, ఎంఈఓ సుజాత పాల్గొని విద్యార్థులకు జ్ఞానాభివృద్ధి, శారీరక అభివృద్ధిపై అవగాహన కల్పించారు. నూతన విద్యావిధానం, భాషాభివృద్ధి, విత్తన దశ నుంచి మొక్క పెరుగుదల, పేపర్ పిరమిడ్ తయారీ గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం పాల్, సీఆర్‌పీ ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేసుకోవాలి

బేస్తవారిపేట: గ్రామాల్లో పంచాయతీ కార్మికులు సేకరించిన చెత్త నుంచి సంపద తయారు చేసుకోవాలని ఎంపీడీఓ టి.పార్వతి అన్నారు. మంగళవారం మండలంలోని చెట్టిచర్లలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద పంచాయతీ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ ఇచ్చారు. చెత్త సేకరించేటప్పుడు తడి-పొడి చెత్తలను వేరు చేసుకోవాలని, వర్మీ కంపోస్టుగా మార్చడంతో ఆదాయం వస్తుందన్నారు. పంచాయతీలకు ఆదాయ మార్గాలను సృష్టించుకోవడంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈఓపీఆర్డీ పి.రామాంజనేయులు పాల్గొన్నారు.



వర్మీ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ పార్వతి